**నాథ్ తెలివితేటల్ని చుట్టుపట్ల మెచ్చుకోనివారంటూ లేరు. బట్టలకొట్లో గుమస్తాగా పనిచేస్తూ ఒక చిన్న సందులోని రేకులషెడ్డులో కాపురం పెట్టినవాడు ఐదేళ్ళు నిండకుండానే, నగర కూడలిలో స్వంతవ్యాపారం ప్రారంభించి, మరో రెండు సంవత్సరాలలో "వటుడింతై...."అన్నట్లు అందరూ ఆశ్చర్యపడేట్లు నాలుగంతస్తులభవనం లేపాడు.**

అతని పెరుగుదల కొందరి ఈర్ష్యా అసూయలకు కారణమైనప్పటికి, కష్టపడి పైకొస్తున్నాడని సరిపెట్టుకున్నారు. 'ధన మూలమిదం జగత్' అన్నట్లు నగరంలోని ప్రధాన వ్యక్తులలో ఒకరుగా గుర్తింపు కూడ వచ్చింది నాథ్‌కు.

పక్షం రోజులకొక పర్యాయమైనా బొంబాయి, మద్రాసు, కలకత్తా లాంటి నగరాలకు వ్యాపార నిమిత్తం వెళ్తూ ఉంటాడు నాథ్.

ఒకసారి బొంబాయి నుండి హైదరాబాద్ వచ్చి కోణార్క ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ చేరి, ఆ రాత్రికి అక్కడే ఒక పెద్ద హోటలులో బసచేశాడు. తెల్లవార్లు బడా బడా వాళ్ళంతా వచ్చి వ్యాపార విషయాలు సంప్రదించడంతోనే సరిపోయింది.

# దొంగకు తేలు కుడితే..

## కేప్టెన్ షేక్ మౌలాలీ

తెల్లవారేసరికి వర్షం మొదలయింది.రోడ్లన్నీ చిత్తడిగా తయారయ్యాయి.చలి కూడ వేస్తోంది.నిద్రలేకపోవటం మూలాన నాథ్ కళ్ళు ఎర్రవయి, బుర్ర వేడెక్కింది.

లెస్ లగేజ్ మోర్ కంఫర్ట్ అన్నట్లు రెండు సూట్ కేసులతో బస్టాండు చేరాడు.

వర్షం కొంచెం మెండయింది. ఏలూరు కౌంటరు దగ్గరకు వెళ్ళాడు. జనం కిక్కిరిసి ఉన్నారు. ప్రక్కన పిట్టగోడ ఎత్తుగాలేని కారణాన జల్లు లోనికికొడుతోంది. బస్సులు వదిలే డీజిల్ పొగ, కౌంటర్ దగ్గర జనం వదిలే బీడి, సిగరెట్, చుట్టల పొగ సుడులు తిరుగుతోంది.

అరగంటసేపు నిల్చున్నాడు నాథ్. కౌంటర్ తెరువలేదు. జనం రద్దీ పెరిగి త్రొక్కిసలాట మొదలయింది.

"కౌంటరు ఎందుకు తెరవలేదు?"
"బస్సు రావాలి కదా!"
"ఎందుకని రాలేదు?"
"చెడిపోయిందట!"

జనం ఇష్టం వచ్చినట్లు చెప్పుకుంటున్నారు.

ఇంతలో కౌంటర్ తెరిచారు.జనం నెట్టుకోసాగారు. ముందుకెళ్ళి టికెట్ కొనాలనుకున్నాడు నాథ్. కాని సాధ్యపడలేదు.

వర్షం జోరు పెరిగింది.

ఒక మధ్య వయస్కుడు తడిసిన బట్టలతో ఆదరాబాదరాగ వచ్చాడు.

"తిరపతి నుంచి ఒచ్చిన బండి ముందుందండి. దానికి తిక్కట్టు కొనుక్కున్నాను. కాని, ఇయ్యాల యిక్కడ మా సుట్టాలింట్లో ఉండాలనుకున్నా.ఏలూరికి పొయ్యేవాళ్ళుంటే తిక్కట్టుందండి! ఏరికన్నా కావాల్నా?" అడిగాడతను.

నాథ్ ఎవరో అపరదేవుడు తన చెవిలో శంఖం పూరించినంతగా ఆనందించాడు.

వెంటనే "నాకివ్వు!" అన్నాడు

"రండయ్య, నా లగేజి అక్కడ ముప్పయ్యారో సీటు దగ్గర పెట్టొచ్చాను. ఇదుగో టిక్కెట్టు! డబ్బు లక్కడ యిద్దుర్గాని!" అని టికెట్‌ను నాథ్ చొక్కా జేబులో దురిమి మీరా సిన్న బ్యాగు తెండయ్యా, పెద్దది నాకిచ్చి తొందర్గ నడవండి, బండి పోతది" అంటూ నాథ్‌కు మారు మాటాడే అవకాశం యివ్వకుండ, అతని చేతిలోని వి.ఐ.పి. సూట్‌కేస్ లాక్కొని వెళ్ళాడు.

నాథ్ నాలుగడుగులు వేసే సరికి వెనకనుండి బస్సు హారన్ వినిపించింది. తప్పుకొని, అది దాటిపోయాక ముందుకు నడిచాడు. యాభయి గజాల దూరంలో ఏలూరు ఎక్స్‌ప్రెస్ నిలబడి ఉంది. వెళ్ళి 36 సీట్లో కూర్చున్నాడు.

"ఈ సీట్లో మనిషున్నాడండీ!" అన్నాడు పక్కన కూర్చున్నతను.

"ఫర్వాలేదు. మా మనిషేలెండి! నాకోసమే సీటు రిజర్వ్ చేశాడు!" అన్నాడు నాథ్ హుందాగా.

ఐదు నిమిషాలు గడిచాయి. నాథ్ సీట్లోంచి లేచి బయటకు తొంగి చూశాడు వాకిట్లో నిలబడి. టికెట్ యిచ్చిన 'శాల్తీ' జాడలేదు.

బస్సు దిగాడు. చుట్టూ కలియ చూశాడు. కాని 'శాల్తీ' దర్శనం లేదు. అంత వర్షంలోను చెమటలు పట్టసాగాయి నాథ్‌కు.

ఇంతలో బస్సు స్టార్ట్ అయింది. గబగబా లోనికెళ్ళాడు. సీటు క్రిందా, ప్రక్కల హడావిడిగా వెతకసాగాడు.

"ఏమిటండీ.. ఏమయింది?" అడిగాడు పక్క సీటాయన.

"నా సూట్‌కేస్!" అన్నాడు నాథ్ కంగారుగా.
"మీరు తెచ్చింది ఒకటేగా.. అదుగో!" అంటూ పైకి చూపించాడతను.

"కాదు.. రెండోది.. అతడు తెచ్చాడు." నాథ్ ముఖ కవళికలు మారసాగాయి.

"అతనంటే.. సీటు రిజర్వ్‌చేసిన 'మీ' మనిషా?" పక్కసీటాయనలో కుతూహలం హెచ్చింది.

"మా మనిషి కాదండి! బుద్ధిగడ్డితిని----"
"అసలేం జరిగిందండీ.. ఏమిటి విషయం.."

చుట్టూకూర్చున్న జనం అడిగారు.

"ఏమయింది... నాకు టికెట్ యిచ్చినట్లే యిచ్చి నా సూట్‌కేస్‌తో ఉడాయించాడు!"

బస్సులో కలకలం బయలుదేరింది. స్టార్ట్ అయిన బస్సు ఆగింది.

రెండు నిముషాల తర్వాత కండక్టరు వచ్చాడు.

"ఏమండి! మీరు దిగి వెంటనే పోలీసు రిపోర్టు యివ్వండి.. వేరే వాళ్ళు కొన్న టిక్కెట్టు మీరెందుకు తీసుకున్నారండి.. ఈ బస్సు కాకపోతే వేరే దాంట్లో వెళ్ళొచ్చుగదా!" అన్నాడు.

"అదేనండి.. ఇందాకటి నుండి చెపుతున్నాను..



బుద్ధిలేక అని!" అంటూ మతిస్థిమితం తప్పినవాడి లాగా నాథ్ బస్సు దిగాడు.

దేనికైనా మంచిదని బస్టాండు, క్యాంటీను, ఆఫీసు, చుట్టుపల్లరోడ్లు అన్నీ వర్షంలో తడుస్తూనే గాలించాడు. లాభంలేకపోవటంతో నాథ్‌కు పిచ్చెక్కినంత పనయింది. శరీరమంతా చలితో ముడుచుకు పోయినట్లనిపించింది. క్యాంటీన్‌లో కూర్చుని రెండు 'టీ'లు తాగాడు. ఒక అరగంట తల పట్టుకొని అక్కడే కూలబడ్డాడు. తర్వాత ఒక నిర్ణయానికొచ్చాడు- పోలీసు రిపోర్టు యివ్వదలచుకో లేదు.

వర్షం వెలిసింది. జనం రద్దీ కూడ తగ్గింది. మరో సూపర్ డీలక్స్ బస్సు కౌంటర్ ప్రక్కన నిల్చుని ఉంది. టికెట్ తీసుకొని ఎక్కి కూర్చున్నాడు నాథ్.

నాథ్ పోలీసు రిపోర్టు యివ్వకపోవటానికి బలమైన కారణం ఉంది. ఆ సూట్‌కేస్‌లో రెండు లక్షల రూపాయిల విలువచేసే బంగారము, గడియారములు వగయిరా ఉన్నాయి. అవి అన్నీ స్మగుల్డ్ గుడ్స్. వానికి తోడు కొన్ని బ్లూ ఫిల్ముల క్యాసెట్లు కూడ అందులో చోటు చేసుకున్నాయి.

అందుకే నాథ్ 'తేలుకుట్టిన దొంగలా'గ గుట్టు చప్పుడు కాకుండ ఉండిపోయాడు. ●